అన్నం పెట్టే రైతన్నను.. రోడ్డెక్కిస్తారా..?

- ప్రభుత్వమే ఎరువుల బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహించడం సిగ్గు చేటు
- రైతుల తరఫున పోరాడుతుంటే పోలీసులతో ఎందుకు అణగదొక్కుతున్నారు.?
- ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది
- 'అన్నదాత పోరు'లో ప్రభుత్వంపై మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే శంబంగి ఫైర్
- అన్నదాత పోరుకు భారీగా తరలివచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ర్యాలీ చేయకుండా అడ్డుకున్న పోలీసులు



పోలీసులు అడ్డుకోవడంతో వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

బొబ్బిలి: అందరికీ పట్టెడన్నం పెట్టే రైతన్నను రోడ్డెక్కిస్తారా?, రైతులకు ఎరువులు అందించకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తారా?,ఇది ప్రభుత్వమేనా?, 2 వేలు అవసరమైన గ్రామానికి రెండు వందలు, 5వేల బస్తాలు అవసరమైన ప్రాంతానికి 500 బస్తాలు విదిల్చి అన్నదాతకు ఆక్రోశాన్ని మిగుల్చుతారా? అని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి మాజీఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రభుత్వాన్ని నిలదీశారు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు, ఇబ్బందులపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశించిన ప్రకారం మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపట్టారు. బొబ్బిలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి రైతులతో ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అక్కడ నిరసన తెలియజేసి, అధికారులకు మెమొరాండం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్ణయించాయి. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా పోలీసులు పది గంటలకే వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఎదురుగా మోహరించారు. డీఎస్పీ జి.భవ్యా రెడ్డి తన సిబ్బందితో సహా కార్యాలయం ఎదురుగా నిలిచి ర్యాలీకి అనుమతి లేదని పార్టీ శ్రేణులకు తెలియజేశారు. తాము ప్రశాంతంగా ర్యాలీ చేసి, మెమొరాండం అందజేస్తామని మాజీ ఎంపీ బెల్లాన, మాజీఎమ్మెల్యే శంబంగి పోలీసులకు చెప్పినప్పటికీ...తమకుపై నుంచి ఆదేశాలు ఉన్నాయని, ర్యాలీకి అనుమతి ఇవ్వలేమని పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ కార్యాలయంలోనే సమావేశం నిర్వహించారు. రైతులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం గజపతినగరం,బొబ్బిలి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ నాయకులు వాహనాల్లో ఆర్డీఓ కార్యాలయానికి తరలి వెళ్లారు.ఆర్డీఓ కార్యాలయ పర్యవేక్షకుడు రామస్వామికి మెమొరాండం అందజేశారు.


ర్యాలీకి అవకాశం ఇవ్వాలని పోలీసులను కోరుతున్న మాజీ ఎంపీ బెల్లాన,మాజీ ఎమ్మెల్యే శంబంగి తదితరులు

కూటమికి పుట్టగతులుండవు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడు బాబు మాట్లాడుతూ అన్నదాతను ఇబ్బందులు పెడితే కూటమి ప్రభుత్వానికి పుట్టగతులుండవని హెచ్చరించారు. మొన్న టికి మొన్న దివ్యాంగులకు పింఛన్లు తీసేస్తామని నోటీసులు అందజేసి వారిని ఇబ్బందులు పెట్టారని, ఇప్పుడు యూరియా దొరక్కుండా చేసి రైతులు ఉసురు పోసుకుంటున్నారన్నారు.కూటమి ప్రభుత్వానికి జనం ఛీకొట్టే రోజులు వస్తున్నాయన్నారు. రైతులకోసం పోరాడుతుంటే గృహ నిర్బంధాలు, అరెస్టులు చేయడం తగదన్నారు.

చంద్రబాబు రైతు వ్యతిరేకి



మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నప్పటికీ రైతులకు ఎరువులను అందించలేక పోవడం దారుణం, నీచమని అని విమర్శించారు. ప్రభుత్వ చేతగాని తనం వల్ల రైతులకు మళ్లీ పాత రోజులు వస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు, ఎరువులు, విత్తనాల సరఫరా కోసం ఏర్పాటు చేసిన కియోస్క్‌మెషిన్లు, సిబ్బంది ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం వాటి ద్వారా ఎరువుల సరఫరా చేయలేకపోతోందంటే అంతకన్నా దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. మీరు ప్రత్యేకించి చేయాల్సిన పనేమీ లేకుండా గత ప్రభుత్వం రైతులకు అవసరమైన మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు మొదటి నుంచీ రైతు వ్యతిరేకనీ, రైతులను ఇబ్బందులు పెట్టడమే లక్ష్యంగా పాలనసాగించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే రైతులకు సరిపడా యూరియా అందజేయాలని, లేకుంటే రైతుల తరఫున మరింత పోరాడతామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు.

ప్రభుత్వం చూసీ చూడనట్టు వ్యవహరిస్తోంది



మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల తరఫున పోరాడుతుంటే ప్రభుత్వం అడ్డుకోవడం పిరికిపంద చర్యన్నారు. ఎరువులు సరఫరాకు సంబంధించి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదన్నారు. ఖరీఫ్‌లో ఏజిల్లాకు ఎంత ఎరువులు కావాలి.? ఎంత ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్న నిబంధనను పాటించలేదని, వ్యవసాయాధికారులతో సమావేశాలు, సమీక్షలు నిర్వహించలేదన్నారు. మరో పక్క భారీ ఎత్తున ఎరువుల నిల్వలు కూటమి నాయకులకు అందించారని, మరి కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్లో విక్రయించారని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులురోడ్డెక్కి పోరాడుతుంటే ప్రభుత్వం చూసీ చూడనట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌కు ముందే ఎరువులను సిద్ధం చేసే వారమని, రైతులకు ఇబ్బందులు లేకుండా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందజేశామని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటోందన్నారు. పది ఎకరాలున్న వారికి కూడా ఒక యూరియా బస్తానే ఇస్తూ రైతులను ఏమార్చుతోందన్నారు. చివరకు రైతులకు నిరసన తెలిపే అవకాశం లేకుండా పోలీసులను పెట్టి నియంత్రిస్తోంద న్నారు. రైతులకు అండగా ఉండాల్సింది పోయి పంటలకు యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే, ఎరువుల కోసం క్యూలో నిలబడితే బఫే భోజనాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అంటున్నారని, ఇదా మీ సంస్కృతి? ఇదేనా రైతుల పట్ల మీ ఆలోచన అని మండిపడ్డారు. రైతులను అవహేళన చేసినా, మోసం చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. శాంతియుతంగా పోరాటంచేస్తున్న మమ్మల్ని అడ్డుకోవడం మీ చేతగానితనమన్నారు.

క్లుప్తంగా

నవదుర్గ ఆలయ హుండీ ఆదాయం రూ. 2.79 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయ హుండీ కానుకల ను మంగళవారం లెక్కించారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, పోలిపల్లి పైడితల్లి ఆలయ ఈఓ బి.వి.మాధవరావు సమక్షంలో హుండీలు తెరిచారు. మొత్తం 91 రోజులకు రూ.2,79,395లు ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ పొన్నాడ శ్యామలరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, అర్చకులు రామాయణం శ్రీనివాసశర్మ, రంపా రామచంద్రరావుశర్మ, రంపా జగదీశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు


గర్భిణులకుభోజనాలు అందజేస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

రేగిడి: ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష పథకం కింద స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మంది గర్భిణులకు వైద్యాధికారి అసిరినాయుడు మంగళవారం వైద్య తనిఖీలు చేశారు. మందులు అందజేసి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు నారాయణ సేవలో భాగంగా స్థానిక సత్యసాయి భజన మండలి సభ్యులు భోజనాలు ఏర్పాటు చేశారు. సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, సభ్యులు భూదేవి, విష్ణుమూర్తి, వెటర్నరీ డాక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజాం: బొద్దాం ఉన్నత పాఠశాలకు చెందిన 230మంది విద్యార్థులకు శ్రీకాకుళంలోని సాయిడెంటల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ కేంద్రంలో మంగళవారం ఉచిత దంతపరీక్షలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను వాహనాల్లో సాయిడెంటల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ కేంద్రానికి తీసుకువెళ్లారు. పలువురు ట్రైనీ డాక్టర్లు విద్యార్థులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు ఇవ్వడంతో పాటు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

పోలింగ్ బూత్ ఏజెంట్ల వివరాలివ్వండి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అధికారులు

బొబ్బిలి: నియోజకవర్గంలోని 264 పోలింగ్ బూత్‌లకు ఒక్కొక్కరు చొప్పున బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను రెండురోజుల్లో రాజకీయ పార్టీలు అందజేయాలని తహసీల్దార్ ఎం.శ్రీను, ఆర్డీఓ కార్యాలయ ఏఓ రామస్వామి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అన్నిరాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఎన్నికల కమిషన్ నిబంధనలను, ఓటర్ల నమోదు, తదితర అంశాలను వివరించారు. పోలింగ్ కేంద్రాల భవనాల మార్పు అనివార్యమైనప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఉప తహసీల్దార్ బలిబాడ గౌరీశంకర్ పాల్గొన్నారు.

వసతిగృహ భవనం ప్రారంభం

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్మించిన కేజీబీవీ టైప్-2 వసతి గృహ భవనాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం ప్రారంభించారు. ఈ హాస్టల్‌లో కేజీబీవీ, హైస్కూల్ బాలికలతో పాటు జూనియర్ కళాశాల బాలికలు చేరవచ్చని అధికారులు చెప్పారు.బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు,ఎస్ఎస్ఏ ఏపీసీ డాక్టర్ ఏ.రామారావు, డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు,ఎంఈఓలు లక్ష్మణదొర, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి చర్యలు


మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న సంక్షేమాధికారి ప్రసాదరావు

బొబ్బిలి: మాజీ సైనికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని జిల్లా సైనిక సంక్షేమాధికారి కె.వి.ఎస్.ప్రసాదరావు చెప్పారు.మాజీ సైనికుల సంక్షేమ సంఘ స్థానిక కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ముందుగా మాజీ సైనికుల సమస్యలనువిని, వారి నుంచి వినతులు స్వీకరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పోలి క్లినిక్ మంజూరైందని చెప్పారు. మాజీ సైనికులకు ఆరోగ్య సేవలందించేందుకు నెల్లిమర్లలోని మిమ్స్ ఆస్పత్రిని ఎంపానెల్మెంట్ ఆస్పత్రిగా రక్షణ శాఖ గుర్తించిందని తెలిపారు. పలువురికి కుటుంబ సంక్షేమ గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు, అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్, కోశాధికారి వి.ఎస్.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపోరుకు తరలిన రైతులు, నేతలు


రాజాం: చీపురుపల్లి వెళుతున్న డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు


బాడంగి: బొబ్బిలిలో నిర్వహించిన నిరసనకు హాజరైన మండల నాయకులు

రాజాం: చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అన్నదాతపోరు నిరసనకు రాజాం నియోజక వర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఉదయం 9 గంటలకు రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి రాజాం పట్టణం, రాజాం, రేగిడి, వంగర మండలాల రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు చేరుకున్నారు. ఇక్కడ నుంచి ర్యాలీగా చీపురుపల్లి వెళ్లారు. పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ వీరందరినీ సమన్వయం చేసి, పోరు నిరస నకు తీసుకెళ్లారు.

ఆంక్షలను లెక్కచేయకుండా..

బాడంగి: కూటమి ప్రభుత్వంపెట్టిన ఆంక్షలను లెక్కచేయకుండా మండల రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు బొబ్బిలిలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి తరలివెళ్లారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యామల శివప్రసాద్, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షుల ఆధ్వర్యంలో నిరసన పోరుకు కదలి వెళ్లారు.

మిగులు పనులకు నిధులు విడుదల చేయాలని వినతి

రామభద్రపురం: తమ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గత ప్రభుత్వంలో నాడు-నేడు పనులు కొంత మేర జరిగాయని, పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసేలా చూడాలని జోగిందొ రవలస గిరిజన గ్రామ ప్రజలు ఎమ్మెల్యే బేబీనాయనను కోరారు.బూసాయవలస కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన రూ.1.60 కోట్లుతో నిర్మించిన జూనియర్ కళాశాల భవనాన్ని ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగిందొరవలస గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. జోగిందొరవలస పాఠశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం రెండు అంతస్తుల్లో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలికవసతుల కల్పనకు రూ.35 లక్షలు మంజూరు చేసింది.అప్పట్లో రూ.19 లక్షలతో ఒక తరగతి గదితో పాటు బాత్‌రూమ్‌లు,కిచెన్ షెడ్డు నిర్మించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో మిగతా పనులు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మిగతా నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పాస్టర్ జాన్,జోగయ్య,మోహన్ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఐటీఐలో మెగా జాబ్‌మేళా రేపు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు మంగళ వారం ఓ ప్రకటనలో తెలిపారు. 12 బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ లు చేయనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, బీటెక్, ఏదైనా పీజీలో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువకులు తమ వివరాలను హెచ్‌టీటీపీ.ఎస్ఏఐపీయూఎస్‌వైఏఎం.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదుచేసుకుని, అడ్మిట్ కార్డుతోపాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని స్పష్టం చేశారు. వివరాలకు 72860 42743, 99888 53335 నంబర్లను సంప్రదించాలనిసూచించారు.

హెచ్‌ఎంపై ఫిర్యాదు

రాజాం సిటీ: డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2018 నుంచి 2023 వరకు పనిచేసిన అప్పటి హెచ్‌ఎం వి.వి. వసంతకుమార్‌పై డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణకు ఆ పాఠశాల ఎస్‌ఎంసీ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎంగా వసంతకుమార్ పనిచేసిన కాలంలో పాఠశాలలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి,తమ సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. బాలుర టాయిలెట్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటికోసం వచ్చిన నిధులు ఏమయ్యాయో తెలపాలని, అలాగే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో పరికరాల కొనుగోలుకు వచ్చిన నిధులపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని వినిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కె.శంకరరావు, ఏ.సుజాత, డి.సూరీడమ్మ, ఎస్.ఉషాశ్రీ ఉన్నారు.

బొంతలకోటికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

బొబ్బిలిరూరల్: కోమటిపల్లి గ్రామానికి చెందిన తూర్పు భాగవతం కళాకారుడు బొంతల కోటి శంకరరావుకు వెస్ట్ బెంగాల్‌కు చెందిన వెల్‌రెడ్ ఫౌండేషన్ రవీంద్రనాథ్ ఠాగూర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది.జానపద కళలు విభాగంలో కనుమరుగవుతున్న తూర్పుభాగవతం కళను ప్రదర్శిస్తున్నందుకు తనను వెల్‌రెడ్ ఫౌండేషన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక చేసిందని శంకరరావు మంగళవారం తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందించాలి

బొబ్బిలిరూరల్: రెవెన్యూ సమస్యలపై గ్రామాల్లో రైతులు,ప్రజల నుంచి వచ్చే వినతులపై తక్షణమే స్పందించాలని తహసీల్దార్ ఎం.శ్రీను వీఆర్‌ఓలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడు తూ పట్టాదారు పాసుపుస్తకాలు ,అన్నదాత సుఖీభవ, శాశ్వత కుల ధ్రువీకరణపత్రాల జారీ తదితర అంశాలపై సూచనలు చేశారు. గ్రామస్థాయిలో రెవెన్యూ సమస్యల పై ప్రజలు, రైతులు జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసేంతవరకు మీరు ఏం చేస్తున్నారని వీఆర్‌ఓలను ప్రశ్నించా రు. పలువురు వీఆర్‌ఓలపై ఫిర్యాదులొస్తున్నాయని, తీరు మార్చుకోవాలని హితవుపలికారు. పట్టాదా రు పాసుపుస్తకాల పంపిణీలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, అందరికీ ఇళ్ల పథకానికి సంబంధించి గతంలో వేసిన జగనన్న లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల వివరాలను అందించాలని పదేపదే చెబుతున్నా కొందరు స్పందించడం లేదని, ఇదే కొనసాగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆర్ఐ కొల్లి రామకుమార్,డీటీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వమిత్వ సర్వే

రాజాం: మండలంలోని రాజయ్యపేట, ఒమ్మి, అమరాం తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు, సర్వేయర్లు మంగళవారం స్వమిత్వ సర్వే నిర్వహించారు.ఈ సర్వేను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎం.సీతారాంపురంలో..

వంగర: ఎం.సీతారాంపురంలో సచివాలయ ఉద్యోగులు, సర్వేయర్లు మంగళవారం నిర్వహించిన స్వమిత్వ సర్వేను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి పరిశీలించారు. మండలంలో ఎనిమిది గ్రామాల్లో స్వమిత్వ సర్వే జరుగుతోందని ఎంపీడీఓ చెప్పారు.

రైతన్నకు తప్పని తిప్పలు

- కొండగూడెం సచివాలయంలో అందుబాటులో 210 బస్తాల యూరియా
- మంగళవారం పంపిణీ చేస్తారని చెప్పడంతో సచివాలయానికి వచ్చిన రైతులు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉన్నా పంపిణీ చేయని వైనం


కొండగూడెం సచివాలయానికి యూరియా కోసం వచ్చిన రైతులు


సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతుకు సపర్యలు చేస్తున్న మహిళలు

సంతకవిటి: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతు సేవాకేంద్రాలు, ప్రైవేటు దుకాణాల వద్ద ఎండలో క్యూలు కట్టాల్సి వస్తోంది.మండలంలోని కొండగూడేం గ్రామ సచివాలయం వద్ద మంగళవా రం యూరియా పంపిణీ చేయనున్నారన్న సమాచారం మేరకు ఆసచివాలయం పరిధిలోని కొండగూడేం, కృష్ణంవలస, శ్రీహరినాయుడుపేట, మాదవరాయపురం గ్రామాల రైతులు ఉదయం 8 గంటలకే సచివాల యం వద్దకు భారీగా చేరుకున్నారు.10: 30 గంటలకు ఏఓ సి.బి.యశ్వంతరావు, పోలీస్ సిబ్బంది సచివాల యానికి వచ్చారు. యూరియా పంపిణీ చేస్తారని ఆశతో రైతులు చాలా సమయం ఎదురు చూశారు. కూటమి నాయకుల ఒత్తిడి ప్రభావమో, మరే కారణమో కానీ సచివాలయంలో 210 బస్తాల యూరియా ఉన్నప్పటికీ అధికారులు వాటిని పంపిణీ చేయలేదు. ఒక్కొక్కరికీ ఒక బస్తా చొప్పున ఇచ్చినా బాగుండేదని, ఎవరి కోసం పంపిణీ నిలిపివేశారో తెలియడం లేదని పలువురు రైతులు అధికారుల తీరుపై ఆరోపించారు. చేసేది లేక ఆవేదన, నిరాశతో రైతులు వెనుదిరిగారు. ఎరువుల కోసం వచ్చిన ఓ మహిళా రైతు సొమ్మసిల్లి పడిపోగా మిగతా రైతులు ఆమెకు సపర్యలు చేయడంతో తేరుకుంది. ఈ సచివాలయం పరిధిలోని నాలుగు గ్రామాల రైతులకు దాదాపు 1150 బస్తాల యూరి యా అవసరమని, ఇప్పటి వరకు రెండు పర్యాయాలుగా 420 బస్తాలు వచ్చాయని, మొదటి దఫా 210 బస్తాలను కొంతమంది రైతులకు పంపిణీ చేసేశామని వీఏఏ మధు తెలిపారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?



రామభద్రపురం-రాజాం వెళ్లే రహదారి పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది.వర్షపు నీటితో రోడ్డుపై గుంతలు చెరువును తలపిస్తున్నాయి.బొబ్బిలి మండంలోని పారాది కాజ్‌వేపై ఇటీవల వరద నీరు ఉధృతంగా పారడంతో కొద్దిరోజులు ఆ కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేసి ప్రత్యామ్నాయంగా రామభద్రపురం-రాజాం రహదారి మీదుగా వాహనాలు మళ్లించారు. దీంతో వాహనాల రద్దీ, భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డుపై గుంతలు మరింత పెద్దవిగా తయారయ్యాయి.ఒక్కో గుంత అడుగు నుంచి రెండు అడుగులు లోతుగా ఏర్పడ్డాయి. ఆగుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాటిని అంచనా వేయలేక వాహనాలు అందులో దింపేస్తుం డడంతో వాహనాలు బోల్తా పడుతున్నాయి.ఈరోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని, ప్రమాదాలు జరుగుతున్నా అధికారు లు పట్టించుకోవడం లేదని ఆమార్గంలో ప్రయాణించే వారు,వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు,వాహనచోదకులు కోరుతున్నారు. - రామభద్రపురం

వేళకు రాని బస్సులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థులు బొబ్బిలి,సాలూరులోని వివిధ కళాశాలలకు వెళ్లాల్సిన వారు. ఉదయం 9 గంటలయ్యేసరికి కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు మంగళవారం ఆ సమయానికి రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. గత కొన్నాళ్లుగా రోజూ ఇదే పరిస్థితి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభమైనా నాటి నుంచి బస్సుల సమయపాలన తప్పిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. బస్సులు వేళకు రాకపోవడంతో సమయానికి కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు ఎప్పుడు వస్తుందా అని గంటల తరబడి కాంప్లెక్స్‌లో ఎదురు చూడాల్సి వస్తోందని అంటున్నారు. ప్రభుత్వం సరిపడా బస్సులు కేటాయించకుండా ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించడం వల్లే ఈ సమస్య అని విద్యార్థులతో పాటు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. బస్సుల్లో మహిళల రద్దీపెరగడం, ఎక్కడికక్కడ నిలిపివేస్తుండడంతో బస్సులు సమయానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రావడం లేదని విద్యార్థులు అంటున్నారు. - రామభద్రపురం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9951602843
Office mail : vzmadvt@gmail.com